# టాకీ తీసిచూడండి!

ఇక ఈ దిక్కుమాలిన టాకీ లైనులోకి ఎన్నటికీ అడుగుపెట్టను. వాళ్ళ "ప్రభావతీ ప్రద్యుమ్నం" నామూలంగా చెడిపోయిందని వాళ్ళు దేశమంతా చాటుతున్నారు. వాళ్ళు చాటకపోయినా అటువంటి టాకీలో వేలుపెట్టిన తరవాత నన్నెవడు చేరనిస్తారు మళ్ళీ?

కాని ఆ దిక్కుమాలిన టాకీ అట్లా కావటానికి నేనే కారణమంటే మాత్రం నేను సహించలేను. నా తెలివితేటలలో విశ్వాసం ఉన్నవాళ్ళు నా స్నేహితులూ నన్ను చూడగానే పెట్టే మొహాలు చూస్తే నాకు ఆత్మహత్య చేసుకో బుద్ధి పుడుతున్నది. నేను జరిగిందంతా చెప్పేస్తాను. నాకు శక్తిలేదుకాని నేను పనిచేసిన కంపెనీ డైరెక్టర్ల నందరినీ "పిచ్చి బొమ్మలల్లే వేళ్ళాడగట్టి" "తలా తోకా తెలియకుండా టాకీలు తీసామని బయలుదేరిన వారందరికీ ఈగతే పడుతుంది" అని చాటింతామని

మా కంపెనీలో భాగస్తులలో ఒక్కణ్ణి కూడా నేను స్వయంగా ఎరగను. అందులో ఇద్దరు కంపెనీ తరపున బాడుగకు తీసుకున్న మోటారుకారులో మా ఇంటికి వచ్చారు. వాళ్ళ వెంట మా సూర్యనారాయణకూడా ఉన్నాడు. వాడి కా కంపెనీతో ఏమిసంబంధమో, వాడి సలహా కంపెనీవారు ఎట్లా ఆమోదించారో, ఆఖరుకు వారికీ వాడికీ ఎట్లా తెగిపోయిందో—ఇవేవీ నాకీనాటికీ తెలియవు. ఆ కంపెనీ వారు నన్ను ప్రొడక్షను మేనేజరుగా బుక్కు చెయ్యటానికి నిమిత్తమాత్రుడుగా వాడు రంగం మీదికి వచ్చి ఆపని కాగానే బయటికి వెళ్ళి తన ప్లీడరు గుమస్తాగిరీలో నిమగ్నుడైపోయినాడు.

నా దగ్గరికి వచ్చిన పెద్ద లిద్దరూ నా దరిద్రస్థితి చూచారు. నేను చవుకగా వస్తానని తెలుసుకున్నారు. వారికి నేనేంచేస్తానో, చెయ్యగలనో,చెయ్యాలో తెలియదు. నన్నుప్రొడక్షను మేనేజరుగా పెట్టుకోండని నేనే చెప్పాను. వారు నా అనుభవం అడిగారు; నాకు తెలియవలసిన అవసరంలేని విషయాలను గురించికూడా ప్రశ్నించారు. ప్రతివిషయాన్ని గురించీ కొంత కొంత మాట్లాడగలశక్తి భగవంతు డిచ్చి ఉండటం వల్ల వాళ్ళకేవేవో సమాధానాలు చెప్పాను. వాళ్ళు నన్ను అనేక విషయాలను గురించి సలహాలు కూడా అడిగారు; అవికూడా ఇచ్చాను. వాళ్ళు నా మాటలు సంపూర్ణంగా అర్థంచేసుకుని వాటితో తృప్తిపడ్డట్టు కనిపించారు. ఒక్క డబ్బు ఖర్చుపెట్టటం విషయంలోనే నేను ఆ ఇద్దరిలోనూ ఒకరికి కోపం తెప్పించాను.

నేను మరేమీ అనలేదు; "ఈ లైనులో అనుభవం లేనివారు సామాన్యంగా దుర్వ్యయం చేస్తారు. ఒక్కొక్కరకం ఖర్చు అవసరమైనదల్లే కనిపించినా గిట్టదు; ఒకొక్కదానికి ఎంత ఖర్చుచేస్తే అంతకు పదింతలు ప్రతిఫలం ఉంటుంది. అది తెలుసుకుని ఖర్చుచేస్తే వృధావ్యయం చాలా తగ్గించుకోవచ్చు" అన్నాను. ఆమాట మీద ఒకాయన కొంచెం అతిశయంగా, "మనం అటువంటి కక్కుర్తిపడ నవసరం లేదు లెండి? లక్ష రూపాయలు అవుతవనే అంచనా వేశాం!" అన్నాడు.

ఈ విషయంలోనే కాదు, నేను మాట్లాడినదానికంతా వారు ఆమోదం కనబరచినప్పుడల్లా నేనన్నది వారి తలకు ఏమాత్రమూ ఎక్కలేదని క్రమంగా తెలుసుకున్నాను.

చక్కని సాంఘిక సమస్య తీసుకుని కథ రాయించమన్నాను. కథాగ్రాతయారు చేసుకుని నటులను బుక్కు చెయ్యమన్నాను. లేకపోతే చాలా ఇబ్బంది పడిపోమా అన్నారు!

ఆఖరుకు "ప్రభావతీ ప్రద్యుమ్నం" నిశ్చయం చేశారు. నిశ్చయం చెయ్యడమేమిటి? నటులను బుక్కు చెయ్యట మేమిటి? ప్రభావతి వేషానికి ఆరుగురు ఆడవాళ్ళను బుక్కుచేశారు. ఆరుగురికీ అడ్వాన్సులిచ్చి పిలిపించి రిహార్సల్సు ప్రారంభించారు. రిహార్సల్సంటే మరేమీ లేదు, హార్మోనిస్టును కుదిర్చి సంగీతం అభ్యాసం చెయ్యటం. ఆ హార్మోనిస్టుకు బాపట్ల లక్ష్మీకాంతయ్య[1]గారి కీర్తనలన్నీ వచ్చును. ఇంతమంది ప్రభావతులూ ఆ ఒక్క ప్రద్యుమ్నుడిమీద పడ్డారు. అందుకని అతన్ని వెళ్ళగొట్టి మరొక హార్మోనిస్టును పిలిచారు. బుక్కయిన ఆడవాళ్ళకు ఏ హార్మోనిస్టయినా ఒకటేనని నేను కంపెనీవారికి చెప్పాను. కాని నా మాట ఎవరికీ అర్థంకాలేదు. కవిని తెచ్చి కథ రాయించేలోపల ముగ్గురు హార్మోనిస్టులయినారు.

ఆ కవి నేను పుట్టక పూర్వం ప్రసిద్ధుడైన నాటకకర్త అని చెప్పారు. ఆయన దగ్గర అచ్చుపడని ప్రభావతీ ప్రద్యుమ్న నాటకం ఉందిట. దాని సమస్త హక్కులూ మా కంపెనీవారు నిపుణతతో బేరమాడి ఎనిమిదివందల రూపాయలకు కారుచౌకగా పుచ్చేసుకున్నారు. వేరే డబ్బు పుచ్చుకోకుండా ఆకవే ఆ నాటకానికి "అనుబంధాలు" రాయటానికి ఒప్పుకోవటంవల్ల కంపెనీకి మరింత కలిసివచ్చింది!

ఆ నాటకంలో పద్యాలూ అనుబంధాలూ కలిసి నూటఇరవై రెండయినై. అందులో పది అంకాలు; ఇరవైమూడు రంగాలు.

ఈ టాకీలో పాల్గొనటానికి బుక్కయిన నటీనట సముదాయం మొత్తం నలభైఇద్దరు. ఇదికాక వంటవాళ్ళూ, పనివాళ్ళూ ఇంకోపదిమంది. ఈ బాపతులో వచ్చిన ఒక వ్యక్తిని గురించి ఒక్కముక్క చెబుతాను. అతనెవరో ఎవరికీ తెలియదు.

---

1. బాపట్ల లక్ష్మీకాంతయ్యగారి కీర్తనలు.

అతను మా లాడ్జికి (తాత్కాలికంగా కంపెనీవారు ఉన్న ఊళ్ళో ఏర్పరచుకున్న ఠికాణాకు) రావటం నేనెరుగుదును. ఎవరు కావాలని అడిగితే "గోపాలస్వామితో కొంచెం మాట్లాడాలి పిలుస్తారా?" అన్నాడు.

గోపాలస్వామి ఎవరో ఎవరికీ తెలియదు. "నువ్వే పిలుచుకో!" అని వాడికి సమాధానం చెప్పారు. ఆ తరవాత వాడు నలుగురిలో పాటు లాడ్జిలో అటూ ఇటూ అర్జంటుపని ఉన్నట్టు తిరగసాగాడు. వాడు లాడ్జిలో అడుగుపెట్టిన అరగంటలో ఆడవాళ్ళంతా తలా ఒక పని వాడి కంటగట్టారు. ఆ తరవాత వాడి కందరూ పని చెప్పారు. వాడు పని తలాయించటం ప్రారంభించేటప్పటికి పదిరోజులు గడిచింది. వాణ్ణి నిలదీసి "నువ్వెవరు? నిన్నెవరిక్కడ పనిచేయమన్నారు?" అని అడిగేటప్పటికి వాడికి కంపెనీవారు నెలజీతం బాకీ ఉన్నారు. ఆ జీతం ఇంత అనిమాత్రం వాడికే తెలియదు.

అయిందేదో అయిపోయింది, ఉన్నవాణ్ణి ఉండనిమ్మన్నారు కంపెనీవారు. ఇంత డబ్బు ఖర్చుపెట్టి చిత్రం తీస్తూ నెలకు పదిహేను రూపాయల దగ్గిర వెనకాడటం నామర్దాగా తోచింది వారికి. నాచెవిలో రహస్యంగా ఒక భాగస్తుడు చాలా దూరాలోచన చేసి అన్నాడు, "ఇప్పుడు మనం వీణ్ణి వెళ్ళగొడితే వాడు మనం తీసే టాకీని గురించి ఏకేస్తాడు" అని.

స్టూడియో మాట్లాడటానికి అయిదుగురు భాగస్థులు వెళ్ళారు బొంబాయికి. అక్కడ ఒకడి సహాయం తీసుకున్నారు. వాడు స్టూడియోవారి దగ్గిరనించి ఖచ్చితంగా వెయ్యి రూపాయల కమిషను మా వాళ్ళకళ్ళ ఎదటే కొటేసి మేం తియ్యబోయ్యే చిత్రాన్ని పుత్ర పౌత్రాభివృద్ధిగా దీవించి తనదారిన తాను చక్కావెళ్ళాడు. అనుకున్న స్టూడియో అద్దెలో సగం అడ్వాన్సు పారేసి, టెక్నీషియనుల చేతుల్లో, ఎందుకైనా మంచిదని తలా ఒక నూరురూపాయల పచ్చకాగితమూ పెట్టి దిగ్విజయం చేసిన మొహాలతో ఇంటికి తిరిగి వచ్చారు మావాళ్ళు.

మేము బొంబాయి ప్రయాణమయ్యే వరకు నాకయినఖర్చు ఇరవై ఐదువేలు కూడా లేదు!

నేను ప్రొడక్షను మేనేజరు కావటంవల్ల భోజనాది సౌకర్యాలన్నీ చూడటం పనిమీద నేనుండిపోయినాను.

మా డైరెక్టరును మేం బొంబాయిలోనే బుక్కుచేసుకున్నాం. అతను తెలుగువాడే. బి. ఏ. తప్పి తండ్రి చావగొడతాడనే భయంతో తల్లి నగలు కొన్ని చేతపట్టుకుని బొంబాయి పారిపోయివచ్చాడుట. బొంబాయిలో అయిదారునెలలు జలసాగా గడిపాడు. హోటలుకు నెలాపదిహేను రోజులకు బాకీ పడితే, వాళ్ళు అతని బట్టల పెట్టె తొక్కిపెట్టి డబ్బుతీసుకువచ్చి పెట్టె పట్టుకుపొమ్మన్నారు. ఆ స్థితిలో మాముఠా వచ్చి దిగినట్టు తెలిసింది అతనికి; నేరుగా వచ్చేసి మా లాడ్జిలో ఒక పూట మకాంపెట్టి ముందు కవిగారితో స్నేహం చేశాడు. కవిగారు, దొరికాడే

చాలునని, తాను రాసిన పద్యాలన్నీ అతనికి వినిపించాడు. మా అతిథి ఆ పద్యా లకు అట్టే పరవశుడైపోయినాడు. ఆ పారవశ్యానికి కవిగారు పరవశుడైపోయి మన కింతకంటె మంచి డైరెక్టరు దొరకడని ఖచ్చితంగా చెప్పాడు. డైరెక్టరన్న ప్రాణికి మూడువేలకు తక్కువ ఎట్లా ఇస్తారు కనకా? పైగా అతనికి బొంబాయిలో ఉన్న స్టూడియోల పేర్లూ, వాటిని పరిపాలిస్తున్న వారి పేర్లూ, నటుల పేర్లూ, వారి జీతాలూ సమస్తమూ తెలుసును! ఇంకో డైరెక్టరుకు మాత్రం ఆ విషయాలను గురించి అంత కంటె ఏం తెలుస్తుంది?

మా డైరెక్టర్‌గారు అడ్వాన్సు తీసుకొని పనిలో ప్రవేశిస్తూనే తనకు మరొక ప్రభావతి కావాలన్నారు. ఆయన వెంట నన్ను తోడిచ్చి ఆంధ్రదేశం పంపారు ప్రభావతిని మళ్ళా బుక్కు చెయ్యటానికి. దిగిన గడప ఎక్కకుండా మేమిద్దరమూ అయిదువందల ఇళ్ళయినా తిరిగాం. ఆఖరుకు చూపులకు బాగా ఉండే పిల్లను చూసి మా డైరెక్టరు బుక్కు చేశాడు. ఆ పిల్ల పేరు మాణిక్యం. దానికి 'పూర్వానుభవం' లేదు. ఫరవాలేదన్నాడు డైరెక్టరు. అది కంట్రాక్టు కాగితంమీద 'మణికం రాలు' అని రాసింది. మా డైరెక్టరుగారు 'మా'కు దీర్ఘమూ, 'కా'కు క్యావడీ స్వయంగా తగిలించి 'రాలు' అనే పదం వాడుకభాషే ననే నెపంమీద అల్లాగే ఉండనిచ్చాడు.

కుమారి మాణిక్యాదేవినీ దాని తల్లినీ వెంట బెట్టుకుని బొంబాయి వచ్చాం. దారిలో మా డైరెక్టరుగారు నాతో లోపాయకారిగా అన్నాడు.

"డైరెక్టర్లు హీరోయిన్ భుజాలమీద చెయ్యి వెయ్యటమూ, పక్కన కూర్చో బెట్టుకోవటమూ ధర్మం—విధి— ఆచారం. అదిచూసి తెలియనివాళ్లు ఏడుస్తారు!" అని.

నేనెట్లా ఏడిచేవాణ్ణి కానని చెప్పాను. అధర్మంగానే ఆడవాళ్ళమీద చెయ్యి వేసే జబ్బు నాకు చాలాకాలమై ఉందని కూడా చెప్పాను.

డైరెక్టరుగారు నావంక పెద్దకళ్ళు చేసి చూసి, "కొంపతీసి మనలాడ్జిలో అటు వంటి వేవీ చెయ్యకండి! చాలా లొల్లి అయిపోతుంది" అన్నారు. ఆ తరవాత అసంద ర్భంగా, "మణి మాత్రం, బోగందయినప్పటికీ అందరినీ మీద చెయ్యివెయ్యనివ్వదు!" అని కూడా అన్నారు.

"కంపెనీ డైరెక్టర్లు తప్పరేమో?" అన్నాను. డైరెకరు గుండెలో పిడుగు పడింది.

మణికీ తల్లికీ వేరే లాడ్జి ఏర్పాటు చేయించాడు డైరెక్టరు. మేము బొంబాయి చేరే లోపల అక్లాజు చేర్చబడ్డది మాణిక్యాలదేవి కంట్రాక్టులో!

ఈ మేళం నాకు కొంత తెలుసునని తెలిసి మా డైరెక్టరుగారు నన్ను తనకు అసిస్టెంటుగా వేసుకున్నారు. ఆనాటినుంచీ నాసిగరెట్ల ఖర్చూ, సినిమాల ఖర్చూ, ఆయనే పెట్టుకోసాగాడు.

మా డైరెక్టరుగారి కేమీ తెలియదని మా కంపెనీవారికి తెలియటానికి రెండు నెలలు పట్టింది. ఆ రెండు నెలల మింజుమలే మేము షూట్‌చేసిన ఫిలిము నంబర్లతో సహా అయిదువేల అడుగులకు పైబడ్డది!

స్టూడియో యజమానే మామీద కనికరించి, "మీ డైరెక్టరు ఎందుకూ పనికి రాడు. మీ అసిస్టెంటు డైరెక్టరును అడ్డం పెట్టుకుని పనికానివ్వండి. మా టెక్నీషి యనులు చాతనయిన సహాయం చేస్తారు! అని చెప్పిన తరవాత మా కంపెనీవారికి కొంచెం నిద్రమత్తు వదిలింది.

నేను వెనకటి వందరూపాయల జీతంమీదనే డైరెక్టరు పదవి స్వీకరించాను. ఆనాటినించీ నేను పచ్చి వెలగకాయలాగా అందరి గొంతులకూ అడ్డుపడ్డాను; నా గొంతుక్కూ అడ్డుపడింది మణి.

నన్ను డైరెక్టరు చెయ్యటం నటుల కెవరికీ ఇష్టంలేదు. నేను నా ధర్మం నిర్వర్తించటం వారికి అవమానం చెయ్యటంలాగోచింది. నేను సెట్టింగుమీద డైరెక్షను ఇస్తుంటే ఒకానొకనటుడు చాలా ఎగతాళిగా "అయ్యా ఒక్కరోజులో మేము డైరెక్టరు కాలేకపోయినప్పటికీ మాకూ స్టేజిమీద పదిహేను సంవత్సరాల అనుభవం ఉందండీ!"అన్నాడు. కామెరామాన్ ముందుకువచ్చి నాతో, "ఆ జంతువు ఏమిటి లెక్చరిస్తాడు సరిగా నిలబడడేం?" అన్నాడు హిందీలో. ఆ జంతువు నాతో అన్నముక్క అతనికి తర్జుమాచేసి చెప్పాను. "వెధవను బూటు తీసుకుని బయ టికి తగులు!" అన్నాడు కామెరామాన్. నాటి ఆంధ్రుణ్ణి పైవాడట్లా అంటుంటే నాకు కష్టమేవేసింది.

నామీద చాలా రిపోర్టులు వెళ్ళినై మా ప్రొప్రయిటర్లకి. వారు నన్ను పిలిచి, "అయ్యా మీకు నటులజోలి దేని?కి మీ డైరెక్షనేదో మీరు చూసుకోండి!" అని సవిన యంగా చెప్పారు.

ఇక మణి విషయం, నేను డైరెక్టరుగా వ్యవహరించినంత కాలమూ నాస్వార్థం ఏమీ చూసుకోలే దనటానికి మణికంటె మంచి ఉదాహరణ ఇవ్వలేను.

మా టాకీలో నటించటానికి వచ్చిన మూకలోకల్లా మంచిదీ, నన్ను గురించి అసహ్యంగా మాట్లాడనిదీ అది ఒకతే. కాని అందరిలోకీ అసమర్థురాలుకూడా అదే— అది వేస్తున్న వేషాన్ని బట్టి చూస్తే నన్ను నానామాటలూ అన్నవారినీ, అవమానించినవారినీ, నన్ను పడగొట్టటానికి సర్వ కష్టాలూ పడ్డవాళ్ళనీ క్షమిం చాను- మణిని క్షమించలేదు. మణి మంచితనానికి ముప్పాతిక మూడు మీసాలు కారణం అది విడిగా, వేరే లాడ్జిలో ఉండటం కావచ్చు. కాని అది అందరూ ఉన్న లాడ్జిలోనే ఉండి, అందరితోపాటు నన్ను తూలనాడితే అందుకు నేను దానిమీద వేరే పగ సాధించి ఉండేవాణ్ణి కాను.

నేను మణితో మొదటినించీ చెబుతూనే వచ్చాను— "నువ్వు కథానాయి

కవు. ఈటాకీ పాడయినా బాగయినా నీమీదే ఉంది. ఈ స్థితిలో మిగిలిన అందరి కన్నా నువ్వెక్కువ శ్రమపడాలి" అని.

నిజానికి మణి శ్రమపడ్డది. కాని నాకు కావలిసిన ఫలితం మాత్రం కని పించలేదు. దానిచేత మాటలు సరిగా చెప్పించటానికి సరిగా సంగీతం పాడించ టానికి రోజుకు పదహారు గంటలు రిహార్సలు చేయించాను. దానికోసం షూటింగు ఆపించాను. ఆ రిహార్సలుకోసమని రాత్రీపగలూ అక్కడేపడివుండి, అక్కడే భోంచేసి, అక్కడే నిద్రపోయినాను. నా ప్రాణం ఎట్లా విసిగిపోయిందో, ఒక్కొక్క ముక్క దానిచేత చెప్పించ లేకపోతుంటే నానరాలు పెటపెటా ఎట్లా తెగిపోయి నయ్యో, ఓర్పు చచ్చి దానిమీద ఎట్లా ఎగిరిపడ్డానో, ఆఖరుకు నేనంటే దానికి ఎంత సింహస్వప్నమయిందో ఎవరు విచారించారూ?

"ఇంకేం షూటింగు ? మా డైరెక్టరు మణిని తగులుకున్నాడు!" అని ప్రారం భించారు మా నటీనటులు. ఇట్లా అంటున్నారని నాకు తెలుసును. కాని నేను లెక్క చెయ్యలేదు.

మణిని బాధపెట్టటంలో నిజానికి లర్థంలేదు. అది అన్యాయం. మొదటి నుంచీ ఆటాకీలో కలిగిన వంకరలన్నీ మణిచేత సరిచేయించటానికి ప్రయత్నం చేస్తున్నానని నాకు తెలుసు. టాకీమీద లాభంవస్తే నాకు దమ్మిడీ రాదు, కాని టాకీ బాగుపడాలనే యావ తప్ప నాకు మరొకటి లేదు. నన్నట్లా సృష్టించాడు దేవుడు.

కాని నా అంతరాత్మ నాకు చెబుతూనే ఉంది, కళ్ళాలు వదిలేసి'టాకీని దాని తోవన దాన్ని పోనిమ్మని. ఆ ప్రబోధం నాకు చాలింది కాదు. అంతకంటె మంచి ప్రబోధం నాకు మణే కలిగించింది.

ఒకనాడు పగలల్లా మణిచేత వెట్టిచాకిరీ చేయించాను. అక్కడే భోంచేసి రెండుగంటలు దానికి విశ్రాంతి ఇచ్చి మళ్ళీ రాత్రి తొమ్మిదింటినించీ రిహార్సలు ఎత్తుకున్నాను. అర్థరాత్రి పదకొండు గంటలయింది. మణి తల్లి మాతో విసిగి నిద్రకుపడ్డది. నాకు శరీరమంతా యంత్రంలో పెట్టి ఒత్తినట్టున్నది.

అకస్మాత్తుగా మణిచేతులో ఉన్న కాగితాలు పక్కనపెట్టి, రెండుచేతులూ ఎత్తిజోడించి,

"నన్నెందుకీ విధంగా చంపుతారు? నాకీపని చేతకాదు. నన్నింటికి పోనివ్వండి! నన్ను బుక్కు చెయ్యమని నేను మీవెంటపడలేదు. మీరే నన్ను వెతుక్కుంటావచ్చారు....

"నేను నిజంగా అంత మందమతిని కాను. మీరెదురుగా పులిమాదిరిగా కూర్చుంటే నేను బెదిరిపోతున్నాను. నేను ఒంటరిగా ఉన్నప్పుడు ఈ మాటలే ఇంతకంటె బాగా అనుకోగలను.

"మీరింత క్రూరంగా ఉంటారని నే నెరగను. ఈ డైరెక్టరుపని తీసుకునే వరకూ ఈ లాడ్జిలో మీరే మంచి వారనుకున్నాను; నా అదృష్టమో ఏమో, మీరు అందరినీ మించి పోయినారు!" అని బొటబొటా కన్నీరు కార్చి ఏడవసాగింది. నాకా క్షణంలో దాన్ని చూస్తే అపరిమితమైన జాలివేసింది. పాపం! అది ఎన్నడూ ఇటువంటి శ్రమ ఎరుగదు. తల్లి ఎంత గారాబంగా పెంచిందో! దానికి అక్షరజ్ఞానంకూడా సరిగా లేదు.

నేను మృదువుగా, "నా ప్రాణంకూడా విసిగిపోయింది, మణీ! ఇక ఈటాకీ గొడవ ఎత్తను. ఇది ఇవాళ ఉంటుంది, రేపు పోతుంది. అంతకంటే శాశ్వతమయిన విషయం ఏమంటే నువ్వాడదానివీ, నేను మగవాణ్ణినీ. ఆ సంగతి ఈ పదిహేను రోజుల్లోనూ ఒక క్షణమైనా నాకు జ్ఞాపకం రాలేదు. ఆ బడితెలు నాకు ఆ సంగతి స్పష్టంగా అర్థమయ్యేటట్టు చెబుతూనే ఉన్నా, నా మట్టిబుర్ర కెక్కలేదు. ఇక ముందు ఆ మాట మరిచిపోను....ఆ దీపం ఆర్పేసి ఇట్లా వచ్చి కూర్చో! కబుర్లు చెప్పు!" అన్నాను.

* * *

మా ప్రొడ్యూసర్లు ఎంతసేపు నన్ను దెప్పినా నేను మాణిక్యాన్ని తగులుకు పోయినానని, అందువల్ల వాళ్ళకు కలిగినమేలు, నేను చేసిన ఏ మంచిపనివల్లా కలగలేదు. నన్ను చూస్తే భయంపోయి, నాదగ్గిర చనువు దొరికిన తరవాత మణి నాకు కావలసినట్టు నటించ గలిగింది. ప్రభావతీ ప్రద్యుమ్నం దిక్కూ దివాణమూ లేకుండా పోయిందంటే దానికి తగిన కారణాలు వేల సంఖ్యలో ఉన్నై. మాణిక్యం ఏమీ చెడలేదు. ఆ దరిద్రపు చిత్రంలో దాన్నిచూసి అది పనికివస్తుందని కనుక్కో గలిగిన పెద్దమనుష్యులు అప్పుడే దాన్ని మరొక టాకీలోకి బుక్కుచేశారు. రేపీ పాటికి అది మరొక ఆంధ్రతార అయి కూర్చుంటుంది.

ఎటువచ్చీ అకారణంగా ఎందుకూ కాకుండా పోయిందెవరంటే—నేనే.

—ముద్రణ : భారతి, సెప్టెంబరు 1939.